సాక్షి శ్రీకాకుళం

గురువారం । 28 । నవంబర్ । 2024



గోల్‌మాల్

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్‌లు జరుగుతున్నాయి. కొందరు మిల్లర్లు నిబంధనలు పాటించడం లేదు. - 8లో

గూడ్స్ రైలులో మంటలు

కాశీబుగ్గ: పలాస రైల్వే స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి 7 గంటలకు గూడ్స్ రైల్లో చిన్నపాటి మంటలు చెలరేగాయి. సుమ్మాదేవి రైల్వే స్టేషన్ నుంచి పలాస రైల్వే స్టేషన్‌కు వస్తున్న బొగ్గు గూడ్స్ రైల్లో అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. రైల్వే సిబ్బంది, ఫైర్ సిబ్బంది సంయుక్తంగా మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు.

30లోగా యాక్టివేట్ చేసుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగంలో చేరిన వారు యూఏఎన్‌ను ఈ నెల 30లోగా యాక్టివేట్ చేసుకోవాలని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ జిల్లా కార్యాలయం అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రూ.50 వేలు విలువ చేసే మందులు స్వాధీనం

జలుమూరు: అల్లోపతి మందుల నిల్వకు అనుమతులు తప్పనిసరి అని జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు ఎం.చంద్రరావు, తనిఖీ అధికారి ఎస్.యుగంధరరావు అన్నారు. బుధవారం శ్రీముఖలింగంలో అనుమతులు లేకుండా మందుల నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు గ్రామానికి చెందిన పెద్ద రామ్మోహనరావు అనే ఆర్ఎంపీ ఇంటి వద్ద తనిఖీ చేశారు. సుమారు రూ.50వేలు విలువైన అనుమతులు లేని మందులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మందులు నిల్వలకు, కొనుగోలు, విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరని స్పష్టం చేశారు.

నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సహించేది లేదు



మల్టీపర్పస్ కేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్ రెడ్డి

కొత్తూరు: పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే సహించేది లేదని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ రెడ్డి అన్నారు. మండలంలోని రాయల పంచాయతీ పరిధి ఎర్రటిగూడ గిరిజన గ్రామంలో సీతంపేట ఐటీడీఏ నిధులతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ కేంద్ర భవనాల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఒప్పంద ప్రకారం నిర్దేశించిన తేదీకి పనులు పూర్తి చేయాలని సూచించారు.

కురిగాం వార్డెన్‌పై విచారణ



కురిగాం వసతి గృహం వద్ద విచారణ చేస్తున్న ఈఓపీఆర్డీ వసంత కుమారి

కొత్తూరు: మండలంలోని కురిగాం ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆందోళన చేశారు. దీనిపై బుధవారం స్థానిక ఈఓపీఆర్డీ వసంత కుమారి వసతి గృహం వద్ద విచారణ చేశారు. అయితే స్టాక్ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్లు ఆమెకు అందించలేదు. విచారణ మధ్యలోనే వార్డెన్ వెళ్లిపోయారని ఈఓపీఆర్డీ తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లిపోవడంతో వారిని విచారించలేదన్నారు. వార్డెన్ పనితీరు బాగు లేదని గ్రామస్తులు తెలిపినట్లు ఈఓపీఆర్డీ చెప్పారు. విచారణ నివేదిక ఎంపీడీఓకు అందజేస్తానని తెలిపారు.

కిడ్నీ ఆస్పత్రికి రెండు ఫార్మసిస్టు పోస్టుల మంజూరు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు ఇద్దరు ఫార్మసిస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్ల సంఘం ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్, జిల్లా అధ్యక్షులు రేజేటీ సుబ్రహ్మణ్యంలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కిడ్నీ రోగులకు ఇకపై ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆశ్రమ పాఠశాల మెనూపై మండిపాటు



బుడంబో ఆశ్రమ పాఠశాల పరిశీలనలో ఏపీఓ చిన్నబాబు

కాశీబుగ్గ: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అధికారులకు ఆదేశించారు. మందస మండలంలోని బుడంబో ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. భోజనం రుచికరంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లకు మెమోలను జారీ చేయాలని డీడీకి ఆదేశించారు. తరగతి గదులను, భోజనశాలలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామ, వార్డు వలంటీర్లను కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, బకాయి వేతనాలు చెల్లించాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వలంటీర్లు ఇటీవల కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన రూ. 10వేల వేతనం ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేశారు.



సరైన సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి, నిరసన తెలియజేసిన 104ఉద్యోగుల దృశ్యమిది. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్ట్‌లో పెట్టి, ఇన్సూరెన్స్ చేయాలన్న డిమాండ్లతో పాటు మరికొన్ని విన్నపాలతో ఆందోళన చేశారు.



108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేసిన దృశ్యమిది. ఇచ్చిన హామీ మేరకు శ్లాబ్‌ల ప్రకారం వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు శ్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని, ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నడపాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగారు.



ఆర్తనాదమే.. పోరాట నినాదమై

- రోడ్డెక్కుతున్న బాధితులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే నిరసనలు
- కక్ష సాధింపులు, ప్రభుత్వ విధానాలు, నేతల దోపిడీపై గగ్గోలు
- రోజుకో సమస్యపై ఆందోళన
- కలెక్టరేట్ ఎదుట నిత్యం కనిపిస్తున్న నిరసన శిబిరాలు
- సోమవారం వస్తే ధర్నాలకు వేదికవుతున్న కలెక్టరేట్, జెడ్పీ

ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని జిల్లా పరిషత్ ఎదుట లారీ యజమానుల అసోసియేషన్ సభ్యులు ఆందోళనకు దిగారు. 10టైర్ల లారీకి రూ. 12వేలు, 12టైర్ల లారీకి రూ. 14వేలు, 14టైర్ల లారీకి రూ. 16వేలు, 16టైర్ల లారీకి రూ. 18వేలు చొప్పున ఇసుక ర్యాంపుల్లో అనధికారికంగా వసూలు చేస్తున్నారని నిరసనకు దిగారు. మూడు లారీ అసోసియేషన్ యజమానులు మూకుమ్మడిగా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఇచ్చిన మేర వెలుగు వీఓఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ వెంటనే రద్దు చేసి, గత నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వీఓఏలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అక్రమంగా తొలగించిన వీఓఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రకరకాల యాప్‌ల భారంతో వీఓఏలు ఇబ్బందులు పడుతున్నారని, రాజకీయ వేధింపులకు పాల్పడుతూ ఉద్యోగం వదులుకోవాలని ఇబ్బందులు పెడుతున్నారని, నేతల బారి నుంచి కాపాడాలని కోరుతూ నిరసనలకు దిగారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కలెక్టరేట్ వేదికగా నిరసన గళాలు ప్రతిధ్వనిస్తున్నాయి. సర్కారు తీరుపై పలు వర్గాల వారు తమ వ్యతిరేకతను బాహాటంగా వ్యక్తం చేస్తున్నారు. ఇసుక దోపిడీకి నిరసనగా, మద్యం షాపులకు వ్యతిరేకంగా, టీడీపీ నాయకుల దాడులకు నిరసనగా, తాత్కాలిక ఉద్యోగుల తొలగింపును వ్యతిరేకిస్తూ, చిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం.. ఇలా ఏదో ఒక సమస్యపై జిల్లాలో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరానికో రెండేళ్లకో మూడేళ్లకో వ్యతిరేకత వస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు మూడు నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది.

లెక్కలేనన్ని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అండ్‌కో ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్టుగా వ్యవహరిస్తుండటంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చెప్పింది చేయక పోగా కొత్త సమస్యలు సృష్టిస్తుండటంతో పలు వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పుడు వారంతా రోడ్డున పడుతున్నారు.

ప్రభుత్వ విధానాలు, అనుసరిస్తున్న వైఖరి, కక్ష సాధింపులు, అధికార దర్పం, నాయకుల దౌర్జన్యం, కాసుల కక్కుర్తి తదితర కారణాలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ముఖ్యంగా హామీలిచ్చి మోసగించిన వైనంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చినాక చేతులెత్తేయడాన్ని తప్పు పడుతున్నారు. ఒకవైపు ఇసుక సమస్యలు, మరోవైపు ఎక్కడికక్కడ వెలసిన బెల్ట్‌షాపులతో ప్రజలు పడుతున్న అవస్థలు, ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వీటితో పాటు తాత్కాలిక, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆకస్మికంగా తొలగిస్తూ రోడ్డున పడేస్తుండటంతో బాధితులంతా ఉసూరుమంటూ రోడ్డెక్కుతున్నారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రేషన్ డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తదితరులను అర్ధంతరంగా తొలగించడంతో మండి పడుతున్నారు. వారంతా నిరసన తెలియజేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, కోటబొమ్మాళి మండలంలోని కిష్టుపురం దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టులు చేయాలని, దళితలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పరిషత్ ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు.



ప్రభుత్వ ఒప్పంద జీఓలు వెంటనే అమలు పరచాలని ఆశా కార్యకర్తలు నిరసనలు తెలిపారు. ఆశావర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, రికార్డులు, సెల్‌ఫోన్‌లు వెంటనే ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, ఆశాలతో సమానంగా వేతనాలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్ల పెంపుదల జీఓ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం



బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, బుచ్చ రమణమ్మ

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల్య వివాహాలను నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి తెలిపారు. బుధవారం ఢిల్లీ నుంచి ఆమె వర్చువల్ విధానంలో నిర్వహించిన 'బాల్య వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకాకుళం ఎన్ఐసీ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. బాల్య వివాహాలు ఎదుర్కోవడంలో వారి విజయాల గురించి మాట్లాడటానికి ఎంపిక చేసిన 9 మంది పిల్లల్లో ఎచ్చెర్ల మండలం కుంచాల కుర్మయ్యపేట గ్రామానికి చెందిన బుచ్చ రమణమ్మతో మంత్రి వర్చువల్‌గా మాట్లాడారు.

అందరి సహకారం అవసరం

కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ బాల్య వివాహాల సమస్య అధిగమించడానికి అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి శాంతిశ్రీ, పీఓ ఎం.మల్లేశ్వరరావు, పీఓ ఐఎల్ నాయుడు తదితరులు హాజరయ్యారు.


ఎదురించి నిలిచాను..

నేను బాల్య వివాహాన్ని ఎదురించి చదువుపై దృష్టి పెట్టాను. దాని ఫలితంగానే ఉద్యోగం చేసి కుటుంబానికి ఉపయోగపడుతున్నాను. నా తల్లిదండ్రులు వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నాకు 14 ఏళ్ల వయసులోనే వివాహం చేశారు. కానీ సమగ్ర బాలల పరిరక్షణ విభాగం వారికి ఈ విషయం తెలిసి నా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. నా వివాహాన్ని రద్దు చేయించారు. నాకు చదువుపై మక్కువ ఉండేది. అందుకే బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాను. బాల్య వివాహాల నిర్మూలను నా వంతు సహాయం చేస్తాను.

– బుచ్చ రమణమ్మ, కుంచాల కుర్మయ్యపేట

టెండ'రింగ్'

- అంగన్‌వాడీలకు స్టేషనరీ సరఫరా
- కొందరికే దక్కేలా వ్యూహాలు
- ఐసీడీఎస్‌లో వివాదాస్పదంగా షార్ట్ టెండర్



శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు స్టేషనరీ సరఫరా కోసం ఆహ్వానించిన టెండర్లు వివాదాస్పదంగా మారాయి. ఎన్నడూలేని విధంగా ఐసీడీఎస్‌లో టెండర్ల ప్రక్రియలో 'రింగ్' అయ్యేందుకు కీలక వ్యక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు ఓ ప్రాజెక్టు అధికారి మధ్యవర్తిత్వం చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 16 ప్రాజెక్టుల పరిధిలో స్టేషనరీ తదితర సామగ్రి సరఫరా చేసేందుకు ఈ నెల 15న షార్ట్ టెండర్‌ను ఆహ్వానిస్తూ ఐసీడీఎస్ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు సీల్డ్ టెండర్(బాక్స్) దాఖలుకు ఈ నెల 25, 26 తేదీల్లో గడువులోనే దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. అంతకుముందే ఆ ప్రాజెక్టు అధికారి అంగన్‌వాడీ కేంద్రాల సామగ్రి వ్యవహారాలతో సంబంధం లేనప్పటికీ, అంతా తానై టెండరింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకునేందుకు కూడా తనకు అనుకూలంగా ఉన్నవారు మినహా మిగిలిన వారికి అవకాశం లేకుండా అడ్డుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఆసక్తిదారులు టెండర్ వేసేందుకు ముందుకు వచ్చినా కార్యాలయంలో టెండర్ పత్రాలను ఇవ్వకుండా గడువు ముగిసినంత వరకూ వ్యవహారం నడిపినట్లు బాధితులు చెబుతున్నారు.

జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రానికి కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే టెండర్ బాక్స్‌లో పడినట్లు తెలుస్తోంది. ఇవి కూడా ఒక వ్యక్తికి సంబంధించిన బినామీలవేనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇటువంటి పరిస్థితిని తాము చూడలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోందని విమర్శిస్తున్నారు. కోటబొమ్మాళికి చెందిన ఓ వ్యక్తి ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించడంతో ఈ టెండరింగ్ వ్యవహారం బయటకు పొక్కింది. ఎలాగైనా తమవారికి టెండర్‌లు దక్కేలా ప్రయత్నిస్తున్న దళారీ అధికారుల పనితీరుపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఫోన్ కాల్‌కు తక్షణమే స్పందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి శ్రీనివాసులు, పక్కనే డీఎఫ్ఓ మోహన్

శ్రీకాకుళం క్రైమ్ : అగ్ని ప్రమాదం సంభవించిందని వచ్చే ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండి తక్షణమే స్పందించాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక విభాగపు అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు సంబంధిత విభాగపు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా అగ్నిమాపక కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, సహాయాధికారి వరప్రసాదరావులతో జిల్లా పరిస్థితులపై సమీక్షించారు. ఇండస్ట్రియల్ ప్రాంతాలు, ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాలు గురించి, ఉన్న యంత్రాలు, పరికరాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి పరికరాన్ని, ఫైర్ రెస్క్యూ ఇంజిన్లు పనిచేసే తీరును సిబ్బందితో స్వయంగా తనిఖీ చేయించి పరిశీలించారు. ప్రమాదాలు సంభవించేటప్పుడు ఎలా జాగ్రత్తలు వహించాలన్నది సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది 30 మంది వరకు పాల్గొన్నారు.

● ఈ నగరానికి ఏమైనది..?

జిల్లా కేంద్రంలో నాగావళి రానురాను డంపింగ్ యార్డుగా మారిపోతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో దుర్వాసన వస్తోంది. నదిలో నీరు తగ్గడం, స్థానికులు చెత్తనంతా నదిలో డంప్ చేస్తుండడంతో ఉన్న నీరు కూడా కలుషితమవుతోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం





టీడీపీ జనసేన కార్యకర్తల మధ్య కొట్లాట

టెక్కలి రూరల్: మండలంలోని పరశురాంపురం గ్రామం వద్ద బుధవారం రాత్రి టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య కొట్లాట జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... పరశురాంపురం గ్రామంలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఉన్న బోరును వాడుకునే క్రమంలో వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగా టీడీపీ కార్యకర్తలు జనసేన కార్యకర్తలతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో మొదలైన వివాదం కొట్టుకునే స్థితికి వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గొడవను సద్దుమణిగించినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ ఘటనపై పోలీసులను ఇరుపార్టీ కార్యకర్తలు ఆశ్రయించినట్లు సమాచారం. అయితే ఈ ఘటన వివరాల గురించి టెక్కలి సీఐ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా ఆయన స్పందించలేదు.

క్లుప్తంగా

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో తక్షణ ప్రవేశాలకు ఈ నెల 29న ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని విభాగాల్లో రిజిస్ట్రేషన్లు నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఉన్నత విద్యా మండలి అనుమతుల మేరకు ఏపీ పీజీ సెట్-2024 అర్హతతో సంబంధం లేకుండా డిగ్రీ అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో నైపుణ్య కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ కోర్సుల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి అర్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల వయసు గల యువత శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు డిసెంబర్ 2లోపు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 7989177887 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల విజేతగా ప్రసన్నకుమార్


బహుమతి అందుకుంటున్న ప్రసన్నకుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు ఈ నెల 25న విశాఖపట్నంలోని పరవాడలో నిర్వహించారు. కాలుష్య నియంత్రణ అనే అంశంపై పోటీలు నిర్వహించగా 190 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో దుప్పలవలస గురుకుల పాఠశాల ఏడో తరగతి విద్యార్థి జె.ప్రసన్న కుమార్ మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరిసిన హేమశ్రీ


బంగారు పతకంతో హేమశ్రీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (గుంటూరులో) జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దూబ హేమశ్రీ సత్తాచాటింది. 55 కిలోల కేటగిరీలో బంగారు పతకం సాధించింది. హేమశ్రీ శ్రీకాకుళం పట్టణంలోని విద్యాధరి డిగ్రీ కళాశాలలో చదువుతూ వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది. ఈ సందర్భంగా విద్యార్థిని వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శ్రీనివాసరావు, భాస్కరరావు బుధవారం అభినందించారు.

1 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నేషన్ సిస్టం) అమలు చేయనున్నట్లు రెక్టార్ బి.అడ్డయ్య బుధవారం తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాలకు ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ మిషన్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిశీలనకు నిపుణులను నియమించినట్లు తెలిపారు. హాజరైన, ముగింపు సమయం రెండుసార్లు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలులో.. గోల్‌మాల్!


బ్యాంక్ గ్యారెంటీ, కొనుగోలు కేంద్రాలు లేకుండానే ఓ మిల్లరు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

- బ్యాంక్ గ్యారెంటీ, అధికారుల అనుమతి లేకుండానే మిల్లర్ల కొనుగోలు
- తుఫాన్ హెచ్చరికలను 'క్యాష్' చేసుకుంటున్న వైనం
- పూర్తిస్థాయిలో తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు



ఎల్.ఎన్.పేట:

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ధాన్యం విక్రయాల్లో కొందరు మిల్లర్లు, దళారుల చేతిలో అన్నదాతలు మోసపోతున్నారు. మరోవైపు తుఫాన్ హెచ్చరికలతో ధాన్యం రాశులకు ముప్పు వాటిల్లే అవకాశముండటంతో రైతుల ఆందోళనను కొందరు మిల్లర్లు క్యాష్ చేసుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ (బీజీ)గా కొంత నగదు బ్యాంకులో జమచేయాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ధాన్యం డబ్బులుగా రైతులకు చెల్లింపులు చేస్తారు. ఇలా బీజీ చెల్లించిన మిల్లర్లకే కొనుగోలుకు జిల్లా అధికారులు అనుమతి ఇస్తారు. బీజీ ఉన్నంత వరకు ధాన్యం ఆ మిల్లుకు పంపించేలా సిబ్బంది పనిచేస్తారు. ఈ ఏడాది బీజీలు చెల్లించకుండానే ఇప్పటికే మిల్లర్లు వేలాది బస్తాల ధాన్యం కొనుగోలు చేసి మిల్లింగ్ కూడా ప్రారంభించారు. అయినా అడిగే వారే లేరు.

కేంద్రాలు తెరిచేదెప్పుడో?

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు దక్కాలంటే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సాంకేతిక, ఇతర సిబ్బంది నియమించాలి. వీరు ధాన్యం తేమ, నాణ్యత పరిశీలించి రైతులు ధాన్యం అమ్ముకునేందుకు సహకరిస్తారు. ఖరీఫ్ వరిచేను కోతలు ప్రారంభమై నెల రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా లేదని భావించిన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులు, మిల్లర్లను ఆశ్రయించి వారు అడిగిన ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు.

పరిశీలిస్తాం: ఆర్డీఓ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా, బ్యాంక్ గ్యారెంటీ (బీజీ) లేకుండా మండలంలోని రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తున్న విషయం టెక్కలి ఆర్డీఓ ఎం కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామని చెప్పారు. మిల్లుల వద్దకు సిబ్బందిని పంపించి విచారణ చేయిస్తామని, తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..



ఈ ఏడాది ఖరీఫ్ వరిపంట యంత్రాల ద్వారా కోతలు అవుతున్నాయి. పచ్చిగానే కోసిన ధాన్యం నాలుగైదు రోజుల పాటు ఎండ పెడుతున్నాం. కొంత మంది రైతులు పచ్చిగానే ధాన్యం విక్రయించారు. ఇప్పుడు ఎండిన ధాన్యం అమ్ముకునేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. దీంతో ఊరిలోకి వచ్చిన దళారులకు, ట్రాక్టర్‌పైన తీసుకుని వెళ్లి రైస్ మిల్లులకు అమ్ముకుంటున్నాం.

– పాలక పట్టయ్య, రైతు, జంబాడ, ఎల్.ఎన్.పేట

బీజీ తప్పనిసరి..



బ్యాంక్ గ్యారెంటీ (బీజీ) లేకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకూడదు. సీఎస్‌డీటీని పంపించి మిల్లులను పరిశీలించమని చెబుతాను. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా, బీజీలు చెల్లించకుండా ధాన్యం కొనుగోలు చేయకూడదు. పరిస్థితి తెలుసుకుని జిల్లా అధికారులకు నివేదిస్తాం.

– జె.ఈశ్వరమ్మ, తహశీల్దారు, ఎల్.ఎన్.పేట

ఖరీఫ్ వరిసాగు	దిగుబడి అంచనా	ధాన్యం కొనుగోలు లక్ష్యం	జిల్లాలో రైస్ మిల్లులు	ఏర్పాటు కావాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు	రైతు సేవా కేంద్రాలు
4.50 లక్షల ఎకరాలు	9 లక్షల మెట్రిక్ టన్నులు	4.90 మెట్రిక్ టన్నులు	570	412	630

రశీదులు ఇవ్వకుండా బోర్డుల ఏర్పాటు


నగరాలపేటలో ఇంటికి నంబర్ బోర్డు వేస్తున్న దృశ్యం

గార: ఇంటి నంబర్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ ఏజెన్సీ సభ్యులు అత్యుత్సాహం చూపారు. బుధవారం కళింగపట్నం పంచాయతీ నగరాలపేటలో బోర్డు ఏర్పాటు చేస్తూనే రూ.50 వసూలు చేస్తున్నారు. దీనిపై ప్రజాపరిరక్షణ ఐక్యవేదిక సభ్యుడు ముంజేటి సాయిరాం రశీదు ఇవ్వాలని కోరడంతో పంచాయతీ కార్యదర్శి ఇస్తారని సూపర్‌వైజర్ సమాధానం ఇచ్చారు. వెంటనే కార్యదర్శి, ఎంపీడీవోలకు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో బోర్డులు వేయడం నిలిపివేసి వెనుదిరిగారు. వాస్తవంగా.. బోర్డుల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ తీర్మానంతో పాటు ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలి. కార్యదర్శి సమాచారమివ్వడంతో పాటు గ్రామంలో దండోరా వేయాలి. అటువంటి నిబంధనలేవీ వీరు పాటించడం లేదు.

పవిత్ర స్వరూపుడు సూర్యుడు


షణ్ముఖశర్మకు హారతిపడుతున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్ : సూర్యుడు పవిత్ర స్వరూపుడని, ప్రకృతి పరంగా ఆరోగ్యం అందిస్తాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో 'శ్రీసూర్య దర్శనం'పై ఐదు రోజుల ప్రవచన యజ్ఞం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుడికి ఉషఃకాలంలో ఉపాసన చేస్తే శక్తులు సిద్ధిస్తాయఅన్నారు. అనంతరం షణ్ముఖ శర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మహిళలు దీపాలతో హారతి పట్టారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, సుమిత్రా కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, గుత్తు చిన్నారావు, తెన్నేటి విక్రమశర్మ, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కప్పగంతుల వెంకటరమణారావు, వి.కామేశ్వరరావు, పి.బాబూరావు, సనపల నారాయణమూర్తి, జంధ్యాల శరత్‌బాబు, పూజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు హరిపురం కోలాట బృందం


కోలాటం బృందం

ఇచ్ఛాపురం రూరల్: తిరుచానూరులో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఇచ్ఛాపురం మండలం హరిపురం గ్రామానికి చెందిన అసిరమ్మతల్లి కోలాట బృందం ప్రదర్శన ఇవ్వనుందని కోలాటం గురువు తిప్పన ధనుంజయం తెలిపారు. ఈ నెల 29న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా ప్రదర్శన ఇచ్చేందుకు బుధవారం బృందం బయల్దేరింది. ఈ సందర్భంగా కళాకారులను పలువురు అభినందించారు.

పోస్టాఫీసులో చోరీకి యత్నం


పరిశీలిస్తున్న క్లూస్‌టీం

ఇచ్ఛాపురం: పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో హెడ్ పోస్టాఫీస్‌లో చోరీయత్నం కలకలం రేపింది. మంగళవారం రాత్రి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు పేపర్లను చిందరవందరగా పడేశారు. బుధవారం ఉదయం పోస్టాఫీస్ తెరిచేందుకు వచ్చిన పోస్టుమాస్టర్ జ్ఞానవతి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే క్లూస్‌టీమ్ వచ్చి పోస్టాఫీసు పరిశీలించారు. ఎటువంటి నష్టం జరగలేదని పోస్ట్‌మాస్టర్ తెలిపారు. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ చిన్నం నాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బలగ పొందరవీధికి చెందిన ఓ వ్యక్తి మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు. గిడుతూరి గోవిందరావు (52) మద్యానికి బానిస కావడంతో భార్య, కుమారుడు మందలించేవారు. ఈ క్రమంలో ఈ నెల 25న పూటుగా మద్యం తాగడంతో భార్య మందలించడంతో మనస్థాపానికి గురై బాత్రూమ్‌లో ఉన్న ఫినాయిల్ తాగాడు. వెంటనే రిమ్స్‌కు తీసుకెళ్లి వైద్య చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

'స్వయం ప్లస్'పై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ప్రారంభించిన స్వయం ప్లస్‌పై ఉన్నత విద్యా మండలి బుధవారం ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించింది. పలువురు విద్యారంగ నిపుణులు హాజరై పలు సూచనలు చేశారు. స్వయం ప్లస్ కోర్సుల్లో విద్యార్థులు చేరేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు, ఆధ్యాపకులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలు, అంతర్జాతీయ విద్యా రంగ మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమీక్షలో వీసీ కె.ఆర్.రజిని, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

జయరామ్‌కు కర్మవీర చక్ర అవార్డు


అవార్డు అందుకుంటున్న పోలాకి జయరామ్

సంతబొమ్మాళి: మండలంలోని రుంకు హనుమంతుపురం గ్రామానికి చెందిన పోలాకి జయరామ్ కర్మవీర చక్ర అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో జీవన ప్రమాణాల అభివృద్ధికి కృషి చేసినందుకు గాను ఢిల్లీలో నవంబర్ 26న హార్ట్‌ఫర్ ఇండియా ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ ప్రిన్సెస్ ఫ్రాన్కోసి స్టూడిజా ఈ అవార్డును ప్రదానం చేశారు. కర్మవీరచక్ర గ్లోబల్ యూత్ లీడర్స్ ఫోలోగా సైతం గుర్తింపు ఇచ్చారు. జయరామ్ హైదరాబాద్‌లో ఐటీ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

కరగాంలోని కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న జేసీ



ఆ మిల్లర్లను ఉపేక్షించవద్దు

- ధాన్యం కొనుగోలులో అలసత్వం తగదు
- ఏజెన్సీ సిబ్బందిపై జేసీ ఆగ్రహం
- పనిచేయని తేమ శాతం యంత్రాలు చూసి అసహనం

నరసన్నపేట: ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగడంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అసహనం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం ఏజెన్సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో పనిచేయని తేమ శాతం పరికరాలను గమనించి అధికారులను ప్రశ్నించారు. నరసన్నపేట మండలం కరగాం, చిక్కాలవలస కొనుగోలు కేంద్రాలను జేసీ బుధవారం పరిశీలించారు. ధాన్యం తేమ శాతం పరిశీలించి షెడ్యూల్ ఇచ్చి ట్రక్‌షీట్ జనరేట్ చేసి రైతు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాలపై నిరంతర నిఘా ఉండాలని తహసీల్దార్, డీటీ, వ్యవసాయాధికారులకు సూచించారు. కరగాం కొనుగోలు కేంద్రంలో ఏజెన్సీ కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్ సరైన సమాధానాలు చెప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి కారణంగానే ధాన్యం కొనుగోలు ఆలస్యం జరుగుతున్నట్లు ఉందని, వెంటనే సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

వారిని బ్లాక్ లిస్టులో పెట్టండి..

నరసన్నపేటలో కొందరు మిల్లర్లు తేమ శాతం పేరుతో అదనంగా రెండు నుంచి నాలుగు కేజీల ధాన్యం అడుగుతున్నారని రైతులు జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఇటువంటి మిల్లర్లను ఉపేక్షించవద్దని, తనిఖీలు చేసి వాస్తవమైతే అటువంటి వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని జేసీ సివిల్ సప్లయ్ డీటీని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లోని యంత్రానికి, మిల్లర్ల వద్ద ఉన్న యంత్రానికి తేమలో ఒక శాతం తేడా చూపిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథ స్వామి జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ మిల్లర్ల మిషన్‌తో తమకు సంబంధం లేదని, మనం నిర్ణయించిందే ఫైనల్ అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి, వ్యవసాయాధికారి కె.సునీత, తహసీల్దార్ సత్యనారాయణ, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొంగరాంలో జ్వరాల విజృంభణ


జ్వరంతో బాధపడుతున్న చిన్నారి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కొంగరాం గ్రామంలో పది రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు బాధితులు మంచం పట్టారు. కొందరు శ్రీకాకుళం ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోగా.. మరికొందరు ఇంటి వద్ద ఆర్‌ఎంపీ వైద్యుల సేవలు పొందుతున్నారు. కాళ్ల నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలతో వీరు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో తాగునీరు కలుషితమైందంటూ గ్రామస్తులు గతంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సైతం ఫిర్యాదు చేశారు. తాజాగా గ్రామంలో జ్వరాలు విజృంభించాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ విజేతగా దుప్పలవలస


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన విజయవాడలో ఈ నెల 25న నిర్వహించారు. ఇందులో దుప్పలవలస గురుకుల పాఠశాల విద్యార్థులు 'హోం పేషెంట్స్ ఫుల్ కేర్ వీల్ చైర్' అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. 7వ తరగతి విద్యార్థి మనోజ్, ఇంటర్మీడియట్ విద్యార్థి కార్తీక్ దీనిని రూపొందించగా.. పీజీటీ జి.త్రినాథరావు గైడ్‌గా వ్యవహరించారు. 190 పాఠశాలల ప్రాజెక్టుల్లో ఈ ప్రాజెక్టుకే ప్రథమ స్థానం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా కో-ఆర్డినేటర్ బాలాజీ నాయక్, ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు బుధవారం అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం


సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: నాటుసారా తయారీ క్రయ విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ హెచ్చరించారు. బుధవారం మెళియాపుట్టి మండలం రింపి గ్రామంలో టెక్కలి, నరసన్నపేట, ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 900 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి, నరసన్నపేట ఎస్సైలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రపోటీల్లో విజయఢంకా మోగించండి


సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల్లో విజయఢంకా మోగించాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ ఆకాంక్షించారు. కాకినాడ డీఎస్‌ఏ స్టేడియం వేదికగా ఈ నెల 28 నుంచి 30 వరకు జరగనున్న 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు బుధవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లాయి. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఎంవీ రమణ మాట్లాడుతూ జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడ పరిచమైన పదేళ్లలో వందలాది మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణించడం ఆనందంగా ఉందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బి.వి.రమణ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో రాష్ట్రపోటీల్లో శ్రీకాకుళం జిల్లాను ముందంజలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ పీడీ మెట్ట తిరుపతిరావు, మల్లేష్, పి.హరికృష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.

దళితులపై దాడులు అధికమవుతున్నాయి


టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న డీవీఎంసీ సభ్యులు

టెక్కలి: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై అత్యధికంగా దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు, సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు కోరారు. బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి నేతృత్వంలో డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. నారాయణరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించి దళితులపై ఎలాంటి దాడులు లేకుండా శాంతియుత కమిటీలు వేయాలన్నారు. అలాగే దళితుల కోసం కేటాయించిన మానిటరీ రిలీఫ్ ఫండ్ విడుదల విషయంలో కలెక్టర్ కార్యాలయంలో గల సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దళితులపై జరుగుతున్న దాడుల్లో అట్రాసిటీ కేసులపై వేగవంతమైన విచారణ చేయాలని నారాయణరావు కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వివిధ ఉద్యోగులపై వేధింపులు లేకుండా చూడాలని విన్నవించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బి.ప్రభాకరావు, గేదెల రమణమూర్తి, డివిజన్ పరిధిలో తహసీల్దార్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు


కొలతలు తీస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఇచ్ఛాపురం: గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను సమకూర్చుతామని మదన్ వలంటీర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణంలోని శ్రీవేంకటేశ్వర పాఠశాల ఆవరణలో బుధవారం 18 మంది దివ్యాంగులకు పరికరాల కోసం కొలతలు తీశారు. కార్యక్రమంలో ఢిల్లేశ్వరరావు, దుర్యోధన, పరశురామ్, పితాంబర్, మోహన్ పాల్గొన్నారు.